క్లుప్తంగా

ఏపీఎన్జీఓ సమావేశానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



లక్ష్మీపురం(చల్లపల్లి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును ఏపీ ఎన్జీఓ సంఘ నాయకులు ఆహ్వానించారు. ఏపీ ఎన్జీఓల సంఘం చల్లపల్లి యూనిట్ అధ్యక్షుడు తోట సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం శివరామ దుర్గాపురంలోని గ్రామ సచివాలయం–2 వద్ద సంఘ నాయకులు ఎమ్మెల్యేను కలిసి సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమావేశాల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఆర్ఐ కిరణ్ కుమార్, పంచాయతీ ఈఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు నందిగామలో గడప గడపకు మన ప్రభుత్వం

పెడన: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మోపిదేవి: ఈ నెల 3వ తేదీన మోపిదేవి ప్రధాన సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అర్జా రామబుజ్జి (74) విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. మోపిదేవి ఎస్సీ కాలనీకి చెందిన రామబుజ్జి మోపిదేవి సెంటర్‌లో తోపుడు బండిపై చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామబుజ్జిని చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య బేబీ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

తీరప్రాంతంలో సాగు పనులు ప్రారంభించాలి

కోడూరు: సముద్ర తీర ప్రాంత గ్రామాల రైతులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ పనులను వెంటనే ప్రారంభించుకోవాలని ఇరిగేషన్ డీఈ రవికిరణ్ అన్నారు. మంగళవారం ఈస్ట్ చానల్ పరిధిలోని 14, 15 నంబర్ పంట కాలువ పరిధిలోని పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో ఇప్పటికే 30 శాతానికి పైగా వరినాట్లను పూర్తి చేశారని డీఈ చెప్పారు. కాలువలకు నీటి రీడింగ్ రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పెరుగుతుందని, ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తామని చెప్పారు. ఏఈ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జెండా పండుగ వేడుకలు

కోడూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ప్రత్యేక జెండా పండుగ వేడుకలను నిర్వహిస్తామని ఎంపీడీఓ పాండురంగారావు మంగళవారం తెలిపారు. నా భూమి, నా దేశం, నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం అజాదీక అమృత్ మహోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో షెడ్యూల్ ప్రకారం ఈ వేడుకలను అన్ని శాఖల అధికారల సమన్వయంతో తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ సూచించారు. తొలిరోజు ఉల్లిపాలెం, జయపురం, మాచవరం పంచాయతీల పరిధిలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గద్దర్‌కు ప్రజా సంఘాల నివాళి

చల్లపల్లి: ప్రజా గాయకుడు దివంగత గద్దర్ భౌతికంగా దూరమైనా ఆయన పాడిన పాటలు సమాజాన్ని జాగృతం చేస్తూనే ఉంటాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యద్దనపూడి మధు అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనశక్తి పార్టీ జిల్లా నాయకులు నందేటి రాజ శ్రీనివాసరావు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సింగోతు నాగేంద్రం, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, హెచ్ఎం కై తేపల్లి దాస్, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, ఏఐఎఫ్‌టీయూ, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- మళ్లీ జగనన్న పాలనను కోరుకుంటున్న ప్రజలు
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- శివరామ దుర్గాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలితంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–2 పరిధిలోని శివరామ దుర్గాపురంలో మంగళవారం ఉదయం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు గ్రామంలో 389 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. పేద కుటుంబాల వారికి గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన గమనించిన రాష్ట్ర ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ చినరాటాలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, తుమ్మల వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అన్నివర్గాలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని వైఎస్సార్ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 26వ డివిజన్‌లోని మినర్వా థియేటర్ ప్రాంతంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతం పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే ముంపుబారిన పడుతున్న పరిస్థితులను ఆయన పరిశీలించారు. ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్, డివిజన్ కార్పొరేటర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ మాడపాటి వెంకటేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

15 నాటికి మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో వైద్య కళాశాల పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల నిర్మాణ పనులు కొన్నింటిలో పురోగతి సరిగా లేదన్నారు. సీసీటీవీలు, వెంటిలేటర్లు, లిఫ్టులు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు తదితర సామగ్రిని వెంటనే తెప్పించి బిగించాలన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు మరలా సమీక్షా సమావేశం నిర్వహిస్తారని, ఎట్టి పరిస్థితుల్లో 15వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు.

సమావేశంలో ఎస్ఈ డి. బాలరామిరెడ్డి, ఈఈ డి. రవీంద్రబాబు, డెప్యూటీ మేనేజర్ ఎ. శివకుమార్, డీఈఈ ఎం. నళిని, ఏఈ వి. కిరణ్, విద్యుత్ శాఖ ఈఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

జేసీ అపరాజితసింగ్



వినియోగదారుల మాడ్యూల్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అపరాజితసింగ్, డీఈఓ, డీఎస్ఓ తదితరులు

మచిలీపట్నంటౌన్: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అన్నారు. స్థానిక నోబుల్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం కన్స్యూమర్ ప్రొటక్షన్ ఫోరం ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి జేసీ మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలోనూ కన్స్యూమర్ క్లబ్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. విద్యార్థులకు ఈ విషయాలను తెలియజేస్తే భావి భారత పౌరులుగా ప్రశ్నించే గుణాన్ని అలవరుచుకుంటారని చెప్పారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ వినియోగదారుల క్లబ్‌ల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో 181 ఉన్నత పాఠశాలల నుంచి హాజరైన ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి బి. పార్వతి మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ఏయే రంగాలకు సంబంధించిందో, ఎలాంటి మెలకువలు తీసుకోవాలో వివరించాలన్నారు. మచిలీపట్నం డీవైఈఓ యూవీ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై రూపొందించిన మాడ్యూల్స్ పుస్తకాన్ని జేసీ. ప్రతినిధులు ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు.

జీజీహెచ్‌కు కళ్లకలక బాధితుల తాకిడి

సిద్ధంగా జగనన్న కంటి వెలుగు మందులు

మచిలీపట్నంటౌన్: స్థానిక జీజీహెచ్‌కు కళ్లకలక బాధితుల తాకిడి అధికమైందని, వీరికి మంచి వైద్యం అందిస్తున్నామని నేత్ర వైద్య విభాగ అధికారి డాక్టర్ జి. భానుమూర్తి మంగళవారం తెలిపారు. కళ్లకలకతో పాటు ఇతర కంటి సంబంధిత వ్యాధులతో వస్తున్న వారికి ఆస్పత్రిలో మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జగనన్న కంటి వెలుగు పథకం ద్వారా ఆస్పత్రికి 15 రకాల మందులతో పాటు కంటి శస్త్ర చికిత్సలకు అవసరమైన మందులు చేరాయన్నారు. ప్రతి రోజూ ఆస్పత్రికి 10 నుంచి 15 మంది కళ్లకలక రోగులు వస్తున్నారని, వీరికి తమ నేత్ర విభాగంలోనే మందులు అందజేస్తున్నామని చెప్పారు. మందుల విభాగానికి వెళ్లి మందులు తీసుకుంటే కళ్లకలక వ్యాధి ఇతరులకు సోకుతుందనే ఉద్దేశ్యంతో కంటి విభాగం ఓపీలోనే డ్రాప్స్, మందులను రోగులకు ఇస్తున్నామన్నారు. కళ్లకలక రాగానే సొంత వైద్యం చేయకుండా ప్రభుత్వాస్పత్రిలోని నేత్ర చికిత్స విభాగానికి వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. వారం రోజుల పాటు ఇంట్లోనే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని, 90 శాతం మందికి వారం రోజుల్లోనే తగ్గుతుందని వివరించారు. కొంత మందికి మాత్రమే ఇన్ఫెక్షన్‌గా మారుతుందన్నారు. ఇలాంటి వారు ప్రత్యేక చికిత్స పొందాల్సి ఉంటుందని చెప్పారు.

నిబంధనల మేరకు ఓటర్ల సర్వే

పెడన: పెడన నియోజకవర్గంలో సమగ్ర ఓటరు సర్వే రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జరుగుతోందని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె పెడన తహసీల్దార్ కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమగ్ర ఓటరు సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో 1.61 లక్షల మంది ఓటర్లుండగా ఇప్పటివరకు 70 వేల మందికిపైగా ఓటర్ల సర్వే జరిగిందని చెప్పారు. కొత్త ఓటర్ల చేర్పింపుపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో బీఎల్‌ఓలు పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, సీపీఎం నాయకులు గోరురాజు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు

నేటి నుంచి 'నా భూమి..నా దేశం'

పెడన: నా భూమి.. నా దేశం.. నేల తల్లికి నమస్కారం .. వీరులకు వందనం కార్యక్రమాలను బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించాలని ఎంపీడీఓ వి. రెడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ శాఖాధికారి, ఎంఈఓ 1, 2, ఈఓపీఆర్డీలను నియమించారన్నారు. 9వ తేదీన బల్లిపర్రు, చెన్నూరు, నందిగామ, నేలకొండపల్లి, పెనుమల్లి, కాకర్లమూడిలోను, 10న గురువిందగుంట, చేవేంద్ర, కమలాపురం, చోడవరం, జింజేరు, కూడూరు, 11న మడక, నడుపూరు, శేరివత్తర్లపల్లి, కొంగంచర్ల, కొప్పల్లి, ముచ్చర్ల, 14న నందమూరు, కొంకేపూడి, లంకలకలువగుంట, అచ్చయ్యవారిపాలెం, పుల్లపాడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలలో దేశభక్తిని ప్రేరిపించడం, వారిని ఉత్తేజపరచడం, అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

పెడన: అధిక వర్షాలతో వెదసాగు వేసిన రైతులు నష్టపోయారని, వారికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తోందని పెనుమల్లి సర్పంచ్ గరికిపాటి రామానాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం ఉరివి రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముందుగా బుక్ చేసుకున్న రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నామని చెప్పారు. ఏఓ జీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్‌బీకేలలో సబ్సిడీ విత్తనాలు అందజేస్తారని చెప్పారు. ఎంపీటీసీ గంధం విజయలక్ష్మి, గంధం శ్రీనివాసరావు, రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటల ఉత్పత్తులతో ప్రయోజనాలు



కషాయాల తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న పార్థసారథి

గూడూరు: సేంద్రియ పంటల ఉత్పత్తులతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని సేంద్రియ సాగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.పార్థసారథి అన్నారు. గూడూరు మండలం తరకటూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. సహజ వనరులను ఉపయోగిస్తూ సేంద్రియ విధానంలో పండిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. రేపటితరం ఆరోగ్యం కోసం సేంద్రియ వ్యవసాయం దాని ఉత్పత్తుల వాడకం తప్పనిసరి అని చెప్పారు. ప్రతి వారం సేంద్రియ వ్యవసాయ పద్ధతిపై తరకటూరులోని రైతు వినయ్ పొలం వద్ద పొలంబడి జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి జీవీ శివప్రసాద్ అన్నారు. ఇందులో 25 మంది రైతులు, మండలంలోని ఆర్బీకే స్థాయి వ్యవసాయ సహాయకులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, మండలంలోని వివిధ గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు



నాగాయలంక: మండలంలో సాగు పనులు ఊపందుకున్నాయి. మూడు రోజులుగా పంట పొలాల్లో వరి నాట్లు వేస్తున్నారు. పుష్కలంగా సాగు నీరు ఉండటం, విత్తనాల కొరత లేకపోవడంతో సాగు పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వరుసగా నాలుగో ఏడాది కూడా సాగునీటికి కొరత లేదు. వరుణుడు కూడా కరుణించాడని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వంద ఎకరాల్లో నాట్లు పడ్డాయని, ఈ సీజన్‌లో 20 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని ఏఓ ఎ.సంజీవరావు తెలిపారు. ఈ ప్రాంత రైతులు బీపీటీ విత్తనాలను అధికంగా సాగు చేస్తారని, మరో పక్క పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు నాణ్యతగా, త్వరితగతిన నాట్లు వేస్తారని ఈ కారణంగా కూలీల సమస్య తలెత్తదని రైతులు తెలిపారు.

అందుబాటులోలేని వీఏఏపై రైతుల ఫిర్యాదు

గూడూరు: తమ గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ) అందుబాటులో ఉండటం లేదని కోకనారాయణపాలెం గ్రామ రైతులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావును రైతులు కలిసి తమ సమస్యను వారికి వివరించారు.

నారికేడాలపాలెం సర్పంచి జంపన రమాదేవి, కోకనారాయణపాలెం ఆర్బీకే చైర్మన్ కొల్లు సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంట పొలాలు మునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రైతులకు అందుబాటులో ఉండాల్సిన వీఏఏ పత్తా లేకుండా పోయాడని చెప్పారు. రైతు భరోసా కేంద్రానికి రావడం లేదని, సచివాలయంలో కూడా కనిపించడం లేదన్నారు. కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో లేడని వాపోయారు. తమకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాయకులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండి ప్రతాప్, జంపన అవినాష్, వేమూరి స్వామి, కాలిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జక్కంచర్ల వార్డుకు నామినేషన్ దాఖలు

గూడూరు: గూడూరు మండలంలోని వివిధ పంచాయతీలలో జరుగనున్న సర్పంచి, వార్డు సభ్యుల ఉప ఎన్నికలలో భాగంగా మంగళవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 10.30 గంటలకు రిటర్నింగ్ అధికారులు ఆయా పంచాయతీలలో ఫారం–1 నోటీసు ప్రచురించారు. జక్కంచర్ల 1వ వార్డుకు వెన్న భారతి నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని కోకనారాయణపాలెం సర్పంచితో పాటుగా జక్కంచర్లలోని 1వ వార్డు, ఆకులమన్నాడులోని 2వ వార్డు, పోలవరంలోని 11వ వార్డుకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. మంగళవారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది.

28 మందికి కంటి ఆపరేషన్లు

బంటుమిల్లి: బంటుమిల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు చెందిన 28 మందిని వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో ఆపరేషన్లు చేసేందుకు మంగళవారం ఏలూరులోని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించామని వైద్యాధికారి వీకే పవన్‌కుమార్ తెలిపారు. కంటి వైద్యులు రమణ పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల వద్ద కంటి వెలుగు శిబిరాలు శిబిరాలు నిర్వహించి 28 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని హాస్పిటల్ వాహనంలో ఏలూరుకు పంపామని, మరలా ఆపరేషన్ల అనంతరం 10వ తేదీన ఇంటి వద్ద దించుతామన్నారు. వైద్యాధికారి సౌందర్య, సూపర్‌వైజర్లు శారదాంబ, శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీపీ వాణి

పెడన: కొంకేపూడి పంచాయతీ పరిధి కట్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎంపీపీ రాజులపాటి వాణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. ఒకేసారి రాష్ట్రమంతా అభివృద్ధి పనులు చేయడం సాధ్యం కాదన్నారు. నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని చెప్పారు. దీనిపై ప్రతిపక్షాల వారు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అచ్యుతరావు, పెడన మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కొంకేపూడి సర్పంచ్ దావు భైరవలింగం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

మోపిదేవి: మోపిదేవిలో రెండుచోట్ల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సీహెచ్ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లె మండలం తుమ్మల గ్రామానికి చెందిన పద్యాల వెంకట రామకృష్ణ వరప్రసాద్ మోపిదేవి ప్రధాన సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా అవనిగడ్డ నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ గాయపడ్డాడు. అలాగే మోపిదేవి కాలనీకి చెందిన కర్రా దేవమాత ఉదయం కూలీ పనుల కోసం కాలనీలో ఆటో ఎక్కుతుండగా కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బాధితులను 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

టి.కొత్తపాలెం(నాగాయలంక): ఉచిత గుండె వైద్య శిబిరం టి.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెంలో గురువారం ఏర్పాటు చేశామని నిర్వాహక ప్రతినిధి వేములమడ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవీణ్ కార్డియాక్ సెంటర్(విజయవాడ) ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు జరిగే శిబిరంలో గుండె, మెదడు వ్యాధులకు సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, టూ డీఎకో స్కానింగ్ ఉచితంగా చేస్తారని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99660 44707 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్కాలర్‌షిప్‌ల విడుదలకు చర్యలు తీసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం నుంచి మైనార్టీ విద్యార్థుల స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సదురుద్దీన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ పి. రాజాబాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు మైనార్టీ స్కాలర్‌షిప్ అందేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంక్షేమ సంఘం నాయకులు ఎండీ మునీర్, ఎండీ ఆరిఫ్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు కిట్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: జిల్లాలోని పలు మండలాలకు చెందిన బుద్ధిమాంద్యత ఉన్న చిన్నారుల్లో మేధస్సు పెంచేందుకు టీఎల్ఎం కిట్లను మంగళవారం స్థానిక లేడియాంప్టిల్ ఉన్నత పాఠశాల ఆవరణలో పంపిణీ చేశారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీస్ (ఎన్ఐఈపీఐడీ) సికింద్రాబాద్ సంస్థ సహాయంతో జిల్లాలోని బాపులపాడు, గన్నవరం, మోపిదేవి, పమిడిముక్కల, పెడన, పెనమలూరు, తోట్లవల్లూరు మండలాలకు చెందిన బుద్ధిమాంద్యత ఉన్న పిల్లలకు ఒక్కో కిట్టు రూ. 10 వేల విలువైన 92 కిట్లను ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా విలీన విద్య సమన్వయకర్త కళ్లేపల్లి ఏడుకొండలు, ఎన్ఐఈపీఐడీ సంస్థ సిబ్బంది, విలీన విద్య రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.